క్లుప్తంగా

12న ప్రాణప్రతిష్ట అక్షింతల ఆవిష్కరణ

ఎదులాపురం: జనవరి 22న అయోధ్య రామ మందిరం ప్రారంభానికి ఉపయోగించే ప్రాణ ప్రతిష్ట అక్షింతలను కంచి పీఠాధిపతి చేతుల మీదుగా ఈనెల 12న ఆవిష్కరించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. మంగళవారం తిర్పెల్లి రాంమందిర్‌లో శోభాయాత్ర ఉంటుందని, పీఠాధిపతి పూజ్య శ్రీవిజయేంద్ర సరస్వతి పాల్గొంటారని పేర్కొన్నారు. జనవరి 1 నుంచి 15 వరకు అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

బస్ సౌకర్యం కల్పించాలి

తాంసి: కప్పర్ల గ్రామం నుంచి తాంసి మండల కేంద్రం మీదుగా బస్ సౌకర్యం కల్పించాలని కప్పర్ల గ్రామస్తులు ఆర్టీసీ అధికారులను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కార్యాలయంలో అధికారులను కలిసి విన్నవించారు. కప్పర్ల గ్రామం నుంచి తాంసి మండల కేంద్రం మీదుగా జిల్లా కేంద్రం వరకు బస్ నడిపితే ప్రయాణికులకు సౌలభ్యం ఉంటుందన్నారు. కళాశాల విద్యార్థులతో పాటు మండల కేంద్రానికి వెళ్లే వారికి సులువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కప్పర్ల గ్రామస్తులు సతీష్, మధుకర్, రాజు, రవి, నంద్, అంకుష్, తదితరులు పాల్గొన్నారు.

'బీజీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ నాయకుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. రిమ్స్ ఉద్యోగులు, కార్మికులను ఆయన ఎమ్మెల్యే బినామీలుగా పేర్కొనడం సరికాదన్నారు. ఏజెన్సీలు తప్పు చేస్తే విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో నాయకులు అశోక్, గంగాధర్, కలీమ్, చంద నర్సింగ్, లస్మన్న పాల్గొన్నారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో సోమవారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రారంభించారు. జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ.. సర్వే రెండు దఫాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సారిగా నిర్వహిస్తున్న సర్వేలో కుటుంబ పెద్ద పేరుతో పాటుగా కుటుంబ వివరాలను నమోదు చేస్తామన్నారు. రెండు నెలల తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వచ్చే వైద్యాధికారుల కోసం మ్యాపింగ్‌కు సర్వే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉదయ్‌కిరణ్, మారుతి, ఏఎస్ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేస్తుంది'

ఎదులాపురం: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తారని, అందుకు సీపీఐ శ్రేణుల కృషి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం పరిధిలో మహిళా లోకానికి ఉచిత బస్ ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు నళిని అర కుమార్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బోథ్: దళితదెబ్బ పేరుతో నార్నూర్ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే విధంగా ఈనెల 13న చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవాలని, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు ఆడెం పొల్లన్న డిమాండ్ చేశారు. సోమవారం బోథ్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణ జరిగే అవకాశం ఉందని, తమ హక్కులను కాపాడాలని కోరారు. ఆయన వెంట నాయకులు, తదితరులున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సుర్దాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సోమవారం సర్పంచ్ సుగుణ ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామల దేవికి విన్నవించారు. పదేళ్లుగా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదన్నారు. గ్రామంలోని పలు సమస్యలను వివరించారు. పంచాయతీ పరిధిలోని బీడీ కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో ఖాళీలు

- పదేళ్లుగా భర్తీకి నోచుకోని డాక్టర్ పోస్టు
- పీటీఎస్ పార్ట్‌టైం స్వీపర్‌తోనే ఆస్పత్రి నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



నార్నూర్‌లోని ఆయుర్వేద ఆసుపత్రి



ఆస్పత్రిలో ఉన్న మందులు

నార్నూర్: యునానీ, హోమియో, ఆయుర్వేదం వైద్యం కనుమరుగవుతోంది. ఇంగ్లిష్ మందులకు డిమాండ్ పెరగడంతో ఆయూష్ కేంద్రాలకు ఆదరణ తగ్గుతోంది. ప్రభుత్వం ఆయూష్ కేంద్రాల పేరుతో అందించే సేవలు క్షేత్రస్థాయిలో రోగులకు అందడం లేదు. అవగాహన లేమి ఒక కారణమైతే, వైద్యుల నిర్లక్ష్యం మరో కారణం. వైద్య సిబ్బంది కొరతతో ఆయూష్ కేంద్రాలకు కంపౌడర్లు, అటెండర్లే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని ఆయూష్ కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో రోగులు ఆస్పత్రికి రావడం లేదు. దీంతో విలువైన ఆయుర్వేదిక్ మందుల కాలం చెల్లిపోతున్నాయి. గత్యంతరం లేక పీటీఎస్ పార్ట్‌టైం స్వీపర్‌తోనే ఆస్పత్రి నిర్వహణ కొనసాగుతోంది. నామమాత్రపుగా ఇన్‌చార్జిలను నియమించి చేతులు దులుపుకుంటున్నారు.

పదేళ్లుగా డాక్టర్ పోస్టు ఖాళీ..

మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆస్పత్రిలో పదేళ్లుగా వైద్యులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న ఇన్‌చార్జి వైద్యులు హోమియోపతి ఒక రోజు కూడా ఆస్పత్రికి వచ్చిన దాఖలాలు లేవు. ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో మొత్తం 4 పోస్టులు ఉండాలి. నాలుగు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం జిల్లా కేంద్రానికి చెందిన వైద్యురాలు ఫర్దినాను ఇన్‌చార్జిగా నియమించిన ఎలాంటి ఫలితం లేదు. బిల్లులకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఇక్కడ ప్రస్తుతం పీటీఎస్ పార్ట్‌టైం స్వీపర్ ఒక్కరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు తెలిసిన మందులను ఇస్తున్నారు. రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో రోగుల సంఖ్య తగ్గుతోంది. పదేళ్లుగా వైద్యులు లేక పోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. రెగ్యులర్ వైద్యులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

ఆయూష్ కేంద్రాలపై జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. యునానీ. ఆయుర్వేద ఆస్పత్రులు సక్రమంగా పని చేస్తున్నాయా. లేదా? అన్న కనీస పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్న మందులు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. తద్వారా ఆయుర్వేద వైద్యం చేయించుకోవడానికి రోగులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆయూష్ కేంద్రాలపై జిల్లా స్థాయిలో పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టిలో ఉంది

రాష్ట్రంలో దాదాపు 60 శాతం వైద్యుల పోస్టులు ఆయుర్వేద ఆస్పత్రిలో ఖాళీగా ఉన్నాయి. భర్తీ చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఎన్నికల ముందు నోటిఫికేషన్ వచ్చింది. కోడ్ అమల్లో ఉండడం వలన రద్దు అయింది. ప్రస్తుతం ఇన్‌చార్జిలతోనే ఆస్పత్రి నిర్వహణ కొనసాగుతోంది. వైద్యులను నియమించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.

– రవినాయక్, ఇన్‌చార్జి వరంగల్

మహిళా ప్రయాణికుల రద్దీ



బస్సు ఎక్కుతున్న మహిళలు

ఆదిలాబాద్/ఇచ్చోడ: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో బస్టాండ్ మహిళల రద్దీ నెలకొంది. కార్తీక సోమవారం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళా ప్రయాణికుల తాకిడి పెరిగింది. అలాగే ఇచ్చోడ వారసంత కావడంతో ఇచ్చోడ నుంచి బజార్‌హత్నూర్ వెళ్లే బస్సు మహిళా ప్రయాణికులతో కిక్కిరిసింది.



ఆదిలాబాద్ బస్టాండ్‌లో..

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

బోథ్: మండల కేంద్రంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ జెండాను ఆవిష్కరించారు. దివ్యాంగులకు ఉచిత బస్ సౌకర్యం, వీల్‌చైర్లు, రూ. 6 వేల పెన్షన్, ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సర్పంచ్ సురేందర్ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

యోగా, ధ్యానంపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: శరీర దృఢత్వం ఉంటే ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అన్నారు. కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా, ధ్యానంపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రతిరోజు యోగా, ధ్యానం చేయడంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోరుబావికి మరమ్మతులు

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలో వారం రోజుల క్రితం బోరు బావి చెడిపోయింది. పంచాయతీ కార్యదర్శికి చెప్పినా.. పట్టించుకోకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడ్డారు. దీంతో సోమవారం ఆరో వార్డులోని ప్రజలు తల కొంత డబ్బు జమ చేసి బోరుబావికి మరమ్మతులు చేయించారు.

కన్నాపూర్ వంతెన నిర్మాణానికి సర్వే



సర్వే చేస్తున్న సర్వేయర్లు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు సర్పంచ్ పెందూర్ జుగాదిరావు తెలిపారు. సోమవారం ఐటీడీఏ అధికారులు, సర్వేయర్లు వంతెన నిర్మాణానికి సర్వే చేసినట్లు పేర్కొన్నారు. ఏళ్లుగా వాగుపై వంతెన లేక వర్షాకాలం ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సర్వేయర్లు సురేశ్, నాయకులు, వివేక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోగు రామన్న నిర్లక్ష్యంతోనే ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ దూరం

- డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న గోవర్ధన్ రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌కు ఎయిర్ ఫోర్స్ స్టేషన్ మంజూరు కాకపోవడానికి మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న నిర్లక్ష్యమే కారణమని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సేవా భవన్‌లో మాట్లాడారు. 2013– 14లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్ కోసం అప్పటి కలెక్టర్ అహ్మద్ బాబు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, మూడు నెలల్లోనే సర్వే పూర్తి చేసి 369 ఎకరాల భూసేకరణ చేపట్టారన్నారు. అనంతరం 1500 ఎకరాలకు పెంచుతూ భూ సేకరణకు ప్రతిపాదనలు పంపారన్నారు. అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న నిర్లక్ష్యం కారణంగా ఎయిర్ ఫోర్స్‌స్టేషన్ రాకుండా పోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటానని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని, అది నెరవేరుస్తారనే నమ్మకముందన్నారు. సమావేశంలో నాయకులు బాబాన్న, రూపేష్‌రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



గ్రాండ్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న జీసీడీవో మెస్రం ఛాయ

నేరడిగొండ: పదో తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా మిషన్ లక్ష్యం అనే వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కుంటాల, లఖంపూర్, కొరటికల్ గ్రామాల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు నిర్వహించిన గ్రాండ్ టెస్ట్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులకు రోజుకు రెండు ఈ మాదిరి పరీక్షలు మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆమె వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజన కళాశాల్లో, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. సోమవారం తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక విష్ణు మాట్లాడుతూ.. ఐటీడీఏకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు, వసతి గృహం చుట్టూ ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కేబీ ప్రాంగణంలోని పీఎంహెచ్, టీటీడబ్ల్యూఆర్‌జేసీ వసతి గృహంలో నీటి సమస్య ఉందన్నారు. ఇంద్రవెల్లి కసూరిబా గాంధీ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగోరావు, కనక మల్కు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఇంద్రవెల్లి: వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థిలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలంగాణ సంస్కృతిక సారథి కళబృందం కళాకారులు అన్నారు. సోమవారం మండలంలోని కేస్లాపూర్ బాలికల వసతి గృహంలో వ్యక్తిగత శుభ్రత, రక్తహీనత, చదువు ఆవశ్యకతపై పాటలు పాడుతూ.. అవగాహన కల్పించారు. ప్రతీ రోజు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పరిసరాల చుట్టూ చెత్తచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిక సారథి కళ బృందం కళాకారులు రవి, వెంకట్‌రావ్, గోవింద్‌రావ్, కుమ్ర నగేశ్, రమేశ్, శంకర్, రాజలింగు, మురళిరాజు, శ్రావణ్ పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

బోథ్: మండల కేంద్రంలోని వేదం పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో సత్తా చాటారు. కాగజ్‌నగర్‌లో జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ (షీటోరియో కరాటే) పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జూనియర్ విభాగంలో సారిక ప్రథమ బహుమతి, ఆరోహి ద్వితీయ బహుమతి, బాలికల సీనియర్ విభాగంలో శ్రీనిధి ప్రథమ బహుమతి, మహన్విరెడ్డి ద్వితీయ బహుమతి, బాలుర సీనియర్ విభాగంలో సాయికిరణ్ ప్రథమ బహుమతి, ధృవ్ ద్వితీయ బహుమతి పొందారు. వీరిని ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ఉట్నూర్‌లో విజయోత్సవ ర్యాలీ



అభివాదం చేస్తున్న వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఏ సమస్య వచ్చిన నేరుగా తనను కలిసి తెలియచేయాలని, లేదంటే ఫోన్ చేసి తెలిపారు. సోమవారం ఉట్నూర్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటిసారిగా ఉట్నూర్‌కు వచ్చిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు ఐబీ ప్రాంతంలోని అంబేద్కర్, అన్నబావుసాతే, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. రోడ్లు, పోడు భూమి, భూ సమస్య, విద్య, వైద్యం, వ్యవసాయం అన్ని అంశాలను పరిగణంలో తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలంలోని కొలాం గూడకు చేరుకున్న ఆయన సూరు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యూం, అజీం, నిసార్, ఎక్బాల్, సలీం, సాజిద్, ఇమ్రాన్, లాజర్, రాహుల్ పాల్గొన్నారు.

బొజ్జన్న బువ్వ ప్రారంభం..

ప్రతీ సోమవారం ఉట్నూర్ ఐటీడీఏలో నిర్వహించే గ్రీవెన్స్‌కు వివిధ మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనుల కోసం బొజ్జన్న బువ్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్నికలకు ముందు నిలిపివేయగా.. మళ్లీ సోమవారం ప్రారంభించారు. గిరినులకు అన్నం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: ప్రజా సంక్షేమమే ధ్యేయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జైనథ్ మండల కేంద్రంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మొదటి సారిగా జైనథ్‌కు విచ్చేసిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిరాల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానుల సమష్టి కృషితోనే ఎమ్మెల్యేగా విజయం సాధించడం జరిగిందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకుపోతానన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పుష్పగుచ్ఛం, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, లోక ప్రవీణ్ రెడ్డి, భోయర్ విజయ్, మయూర్ చంద్ర, రాకేశ్‌రెడ్డి, పోతురాజు రమేశ్, చంద్రకాంత్ చౌదరి, కరుణాకర్ రెడ్డి, వెంకన్న, రవి పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నివాసంలో సోమవారం పలువురు ఉద్యోగ, కార్మిక, కుల సంఘాల నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు బండారి కృష్ణ, అల్లాడి రఘురాం, మహేందర్, మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు దర్శనాల నగేశ్, నక్క శంకర్, శ్రీలక్ష్మి, రమేశ్, అంజన్న గౌడ్, గణేష్ గౌడ్, సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.

కంచి పీఠాధిపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి రామాలయంలో బస చేస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామిని సోమవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దర్శించుకున్నారు. ఆయన ఆశీర్వచనాలు తీసుకున్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంగన్‌వాడీలు

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు జిల్లా పశుసంవర్ధక శాఖ, ఆర్ అండ్‌బీ, పంచాయతీ కార్యదర్శులు, తదితర శాఖల ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి, సన్మానించారు. అలాగే నిర్మల్ జిల్లా సోన్ మండల జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో పాటు పలువురు నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు సన్మానం

ఇచ్చోడ: బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను సోమవారం ఇచ్చోడ మండల నాయకులు సన్మానించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా సన్మానించినట్లు నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, కోకస్‌మన్నూర్, జామిడి సర్పంచులు గంగారాం, సుభాష్‌పటేల్, సోన్‌కాంబ్లే కృష్ణకుమార్, సరాల శ్రీనివాస్, రుద్రాక్ష వినయ్, గోపుల వినోద్, అల్లీ చావుస్, సోమన్న పాల్గొన్నారు.

సిరిచెల్మ మల్లన్న ఆలయంలో పూజలు

ఇచ్చోడ: మండలంలోని అతిపురాతన సిరిచెల్మ మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనిల్‌జాదవ్ మొదటిసారిగా సిరిచెల్మకు రావడంతో ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. సిరిచెల్మ ఆలయ అభివృద్ధి కృషి చేస్తానని తెలిపారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



ఆకట్టుకుంటున్న పల్లె ప్రకృతివనం

తాంసి మండలంలోని సావర్గాం గ్రామంలో గత రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ఆకట్టుకుంటుంది. గ్రామ సర్పంచ్ మునేశ్వర్ భారత్ ప్రత్యేక శ్రద్ధతో పచ్చదనం కనువిందు చేస్తోంది. - తాంసి